# ప్రణయకళంకం

## స్కెచ్

తెల్లవార్లూ రాబోయే పత్రికకు వ్యాసాలను చూచుకుని వాటిని ఒక క్రమంలోపెట్టి పునాదివేళాను అచ్చాఫీసుకి పంపడానికి. ఇంటికి నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ వచ్చి తలుపు తీసే సరికి ఒక వుత్తరం పడివుంది. పోస్టుమేన్ తలుపు సందులోనుంచి పారేసివుంటాడు. దస్తూరీ సోదరుడు ర...ది...ఆత్రుతగా విప్పి చదివాను.

“అక్కా! నా జీవితంలో ఎన్నో నగ్న సత్యాలు దాచాను. నీదగ్గర వాటి విషాద పరిణామమే నా మరణం. నీకు తెలిసివుంటే తోడ్పడేదానివేమో కాని యాచించేందుకు ఆత్మగౌరవం అడ్డువచ్చింది. రచయితగా నా జీవిత ప్రారంభంలో సాయపడిన నీకే అంతిమలేఖ రాస్తున్నా బాధిస్తే క్షమించు.

మనం కాలేజీ చదువుకి స్వస్తిపాడిన రోజుల్లోనే యీ నాటకానికి నాందిప్రస్తావన జరిగింది. పరీక్షలయిన తరువాత యింటికిపోతున్నాను. రాజమండ్రి స్టేషనులో ఎక్కాడు టికెట్ కలెక్టరు. అందరి టిక్కెట్లు చూస్తూ ఒకచోట ఆగి “ఏదీ నీ టికెట్?” అన్నాడు. “లేదు. కొనలేకపోయా క్షమించి కనికరించండి” అంది దీనంగా ఒక స్త్రీకంఠం. నాకళ్ళు టకాలున అటు మళ్ళాయి. ఒక పద్ధెమిదేళ్ళ యువతి, నిండు చంద్రునిలాంటి మొగం కలువరేకుల్లాంటి కన్నులు మల్లెపూవు ఛాయ, చినిగిన సిల్కుచీర, మాసిన మొఖమల్ రవిక. మెళ్ళో ఏమీలేవు-చేతుల కంతకన్నా లేవు. “వేషం డాబుగానే వుంది. చీర అమ్మేసి టికెట్ కొనుక్కోపోయావా?”అని పరిహాసంగా నవ్వేడు ఆ నల్లటి సుందరుడు.(ఆంగ్లో ఇండియన్ టికెట్ కలక్టరు) ఆ పిల్ల సిగ్గుతో తల వంచుకుంది. కాదు కృంగిపోయింది. జేబువంక చూసుకున్నా నిండుగానే వుంది. “ఏమండీ ఆ అమ్మాయికి కాకినాడ వరకు టిక్కెట్టు ఎంతవుతుంది” అన్నా పదిహేను రూపాయలు సార్. సార్,రాస్కెల్సు చూడండి. డబ్బులేకుండా ప్రయాణం చేస్తారు-రైల్వే అంతా వీళ్ళబ్బసొమ్మనుకుంటారు” అని తిటుతూ రిపోర్టిచ్చాడు నాతో-జేబులోంచి పదిహేను రూపాయలుతీసియిచ్చి టికెటు వ్రాయమన్నా- అందరి కళ్ళు ఒకేసారి నామీదపడ్డాయి. “ఆవిడ ఎవరు సార్?” అన్నాడు టికెట్ కలక్టరు సాఫీలోకొచ్చి. “మా బంధువులేలెండి” అన్నా. విరుగ్గా తనకందిన పండేదో నేచువొంగిలించినట్టు చూస్తూ టికెట్ వ్రాసియిచ్చాడు. కాకినాడచేరాం యిద్దరమూ. స్టేషన్‌లోదిగగానే పెట్టిపరుపు తన నెత్తినపెట్టుకోబోయింది. “వద్దులే అమ్మాయ్. కూలీవాడు పట్టుకుంటాడు” అన్నా ప్రథమ సంభాషణగా ఇంతకన్నా యేంచెయ్యగలను. “నాదగ్గరేమీ లేదు మీకీయడానికి” అంది కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ. “నేనేం ప్రతిఫలమాశించలేదమ్మాయ్ నీకథేమిటో చెపితే నువ్విలారావటానికి కారణమేంటో నీ కాటంకంలేక చెపితే విని చేతనైతే సాయంచేస్తా”అన్నా.“రాత్రికి ఎక్కడేనా తలదాచుకుందికి రవ్వంతచోటిస్తారా? వివరంగా అన్నిసంగతులు మనవిచేస్తా” అంది.

బండిలో తిన్నగా బజారుకిపోయి నాలుగు చీరలు కరీంహాలులో కొని, డ్రెస్‌మార్టుతలుపు తీయించి నాలుగు రవికలు తీసుకుని హోటల్‌కి తిన్నగా పోయాం. ఆ హోటలుగదిలో తనకథ చెప్పింది సరసు. ఇంటరు పాసయి సినీమాఫీల్డులో తారగా చెలామణీ కావడానికి మద్రాసు పోయింది. అక్కడ ప్రతీదర్శకుడు ఆమె కళాశక్తికి జోహారులర్పించాడు. ప్రతీ నిర్మాతా ఆమెరూపాన్ని అభినందించాడు. కాని ఏంలాభం వారుకోరేది-ఈమె ఇవ్వలేదు. ఆమె అభిమానవతి. శీలం బలి చేయలేకపోయింది. ఆరునెలలు గడిచేసరికి దగ్గర వున్నవన్నీ కరిగాయి. నిస్పృహతో రైలెక్కింది

ఆమెకోసం వూళ్ళో ఒకమారుమూలంది అద్దెకు తీసుకొన్నా. చుట్టూనివసించేవాళ్ళు కాడీమూక కావటంచేత రోజూ ఒకసారేనా వెళ్ళి చూడాలిసి వచ్చింది. ఇంట్లో తెలిసిందీ విషయం. మా నాన్న తిట్టారు. అమ్మ నేనుచెడిపోయినందుకు ఏడ్చింది. మూడురోజులు హోరాహోరీగా దెబ్బలాడి యింటి అందరూ నాకు నరకాన్ని కల్పించారు. నాన్నదగ్గర సెలవు తీసుకున్నా. ఆయనకోరాడు ఆ అమ్మాయిని విడిచేయమని. అమ్మ బ్రతిమాలింది. కాని నాపట్టుదల నీ వెరుగుదువుగా-యిల్లు విడిచిపెట్టాను.

ఒక పల్లెటూరిలో అమ్మాయిచ్చిన అయిదు వందల్తో నివాసం ఏర్పాటు చేసుకొన్నాను. తొలి పరిచయాలలోనే పత్రికలు ఆహ్వానించాయి. ఇది పూలబాట అనుకున్నా. యెన్నో కలలుగన్నాం. నేను వ్యాసాలు చెపుతూవుంటే ఆమె రాసేది. ఒకసారిచూసిపత్రికలకుపంపేవాళ్ళం-ఆపల్లెటూరిలోనే మా ప్రణయజీవితం ప్రారంభమయింది. పున్నమినాడు నిండుచంద్రునిసాక్షిగా సరసుని స్వీకరించానునాజీవితభాగస్వామిగా.పురోహితుల మంత్రయుక్త వాగాడంభరాలు కావు మా పరస్పర వాగ్దానాలు. అగ్నిసాక్షి కాదు. చంద్రుని సాక్షి.సన్నాయిడోలుల విపరీత శబ్దాలు లేవు. చల్లగాలుల మృదునినాదమే - అదీ మా పవిత్ర వివాహం. ఆ రోజుల్లో స్వర్గాన్నే చవిచూశాను. మూడేళ్లు గడిచాయి. ఎన్నో సన్మానాలుచేశాయి పత్రికలు. ఎన్నోచోట్ల వుపన్యాసాలు కురిపించి అభినందనలందుకున్నా కాని అవి లక్ష్మీప్రసన్నం కావు, సరస్వతీ ప్రసన్నమే. మా జీవితాలు ఎంతో నిరాడంబరంగా సాగించాం. నాకు రెండు లుంగీలు, ఆమెకు రెండు చీరలూ వుండేవి అంతే. నీవిచ్చిన ధోవతులు సన్మానాలకి దాచుకున్నాను. రోజూ మా వ్యాసాలు పడిన పత్రికలు వచ్చేవి. అయిదేళ్లు గడిచాయి. పాప కడుపునపడింది. పురిటికి మంత్రసానులు లేరు. దయదల్చి వచ్చిన ముసిలి ఎరకల్దే పురుడుపోసింది. చీరలు లేకపోవటంవల్ల పురిటిలోనే చెరువుకిపోయి వుతికితెచ్చుకొనేది. ఆ పదిరోజులు నాకు సాయంచెయ్యలేక మానివేశిందంతే, అక్కడనుంచీ తనూ నాతో సమానంగా కష్టపడేది. పాపని వుయ్యాల (నా చిరుగుల పంచతో కట్టింది)లో పెట్టి వూపుతూ నేను వ్యాసం చెప్పకుపోతే ఆమె వ్రాసేది. మమ్మల్నంతా మెచ్చుకునేవాళ్ళే—కాని ఏం లాభం? ప్రతిఫలం శూన్యం. రెండు నెలలు గడిచేసరికి పాపకి పాలులేవు, చేతిలో కానీలేదు, ఎలా కొంటాను? సరసు బ్రతిమాలి ఏ దయగల తల్లిచేతో యిప్పించేది. కాని రోజూ ఎవరిస్తారు? పాప కృశించింది. ఏడ్చి ఏడ్చి మరణించింది. సరసు గుండెపగిలేటట్టేడ్చింది. అక్కా! నేను కసాయివాణ్ణి, ఈ చేతులతోనే పాపనిపూడ్చాను. సరసుకి కాంతి నశించింది. చిక్కి శల్యమయింది. భావశూన్యంగా నేను చెపుతూవుంటే నిర్జీవంగా ఆమె రాసేది. నేడు అర్ధరాత్రయింది సరసు లేచింది. "ఈ పున్నమినాడే మన ఆనంద జీవితానికి తెర ఎత్తాం. యీ రోజునే నా విషాద జీవితానికి స్వస్తిచెపుతున్నా! మీరయినా సుఖపడండి. పంతాలకుపోక యింటికివెళ్ళి హాయిగా జీవించండి"అంటూ పడిపోయింది "సరసూ"అని కేకపెట్టి పట్టుకోబోయాను. చేతిలో వున్నది ప్రాణంలేని కట్టె. నాకిప్పటికి హృదయం కదిలింది. అవును యిక జీవించలేను. నీకు యీ వుత్తరం చేరేసరికి యీ లోకాన్ని విడుస్తా—వెళ్లుతున్నా - సెలవు.

కళ్ళ నీరుచిమ్మాయి. లేదు కరుణకి తావులేదు. గరడుగట్టింది నా హృదయం. సోదరుని మరణానికి మెత్తనివారెవరేనా విచారిస్తారేమో కనీసం అని లేఖ ప్రకటిస్తున్నా.

అతని మరణానికి పత్రికలన్నీ మొదటిపేజీల్లో సంతాపవాక్యాలు పెద్ద అక్షరాల్తో వ్రాశాయి. స్మారక చిహ్నానికి చందాలు వసూలుచేశారు. ఆత్మశాంతికి రోజూ ప్రార్థించారు. బ్రతికివున్నప్పుడు చేయకపోయినా యీ డబ్బంతా ఖర్చుపెట్టారా జీవికి. కాని యేం లాభం?